కేంద్ర కారాగారాలను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి- కడప

సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సోమవారం కడప నగరంలో గల పురుషుల, మహిళ కేంద్ర కారాగారాలను సందర్శించారు. అక్కడ పారా లీగల్ వాలంటీర్ల ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. పురుషుల, మహిళల కేంద్ర కారాగారాల్లో ఖైదీలలో సత్ప్రవర్తన కలిగిన వారిని నూతన పారా లీగల్ వాలంటీర్లగా ఎన్నుకొని వారికి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పురుషుల, స్త్రీల కారాగారంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ పనిచేస్తూ ఉంటాయి అని తెలిపారు. ఈ క్లినిక్ లో పారా లీగల్ వాలంటీర్లు విధులు నిర్వహిస్తూ తోటి ఖైదీల సమస్యలను తెలుసుకుంటూ వారు ఏవైనా అర్జీలు సమర్పిస్తే వాటిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇస్తారన్నారు. వాటిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బుజ్జగింపులు.. సంప్రదింపులు

- పోటాపోటీ ఎత్తుగడల్లో వైసిపి, టిడిపి
- 28న సతీష్‌రెడ్డి కార్యకర్తల సమావేశం
- మాజీ ఎమ్మెల్యేలు ద్వారక, రమేష్‌రెడ్డి వైఖరులపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో బుజ్జగింపుల పర్వం పతాక స్థాయికి చేరుకుంది. రెండ్రోజుల కిందటి నుంచి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి తనదైన శైలిలో బుజ్జగింపులు, సంప్రదింపులు, చేరికలకు తెరలేపాయి. ప్రధాన నాయకులు మొదలు ద్వితీయశ్రేణి నాయకుల వరకు ఎవరినీ మినహాయించడం లేదు. రెండు నెలల కిందట కడప టిడిపి ఇన్‌ఛార్జి మాధవీరెడ్డి కడప మైనార్టీ నాయకులు అమీర్‌బాబును టిడిపి జాతీయ నాయకులు చంద్రబాబు దగ్గరికి పిలిపించుకుని బుజ్జగింపులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రెండ్రోజుల కిందట వేంపల్లికి చెందిన శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ ఎస్.వి.సతీష్‌రెడ్డితో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులు సంప్రదింపులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ఆయన ఈ నెల 28న కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బద్వేల్‌లో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కుటుంబీకుల మధ్య నెలకొన్న విభేదాల పరిష్కారానికి చొరవ తీసుకోవడం, తాజాగా జమ్మలమడుగు నియోజకవర్గానికి సంప్రదింపులను, బుజ్జ గింపులను విస్తరించడం గమనార్హం. సోమవారం రాత్రి జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఆయా మండలాలకు చెందిన బిజెపికి చెందిన మాజీ మంత్రి ఆది నారాయణరెడ్డి ప్రధాన అనుచరులుగా ముద్ర పడిన నాయకులను వైసిపిలో చేర్చుకునే అవ కాశాలు ఉన్నట్లు ఊహాగానాలు సాగుతుండడం గమనార్హం. అదే జరిగితే పొత్తు ధర్మమనే పేరుతో జమ్మలమడుగు టికెట్‌ను ఆశిస్తున్న బిజెపికి చేరికల అంశం శరాఘాతంగా మార నుంది. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ టిడిపి టికెట్ రేసులో చివరి వరకు నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు గడికోట ద్వారకనాథరెడ్డి, ఆర్.రమేష్‌రెడ్డి ఎటువంటి వైఖరి తీసుకుంటారోననే ఆసక్తి నెలకొంది. ఏదేమైనా ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయ సమీకరణలు ఊహించని వేగాన్ని సంతరించుకోవడంతో రాజకీయం రసవత్తరంగా సాగుతోందని చెప్పవచ్చు.

రైతులపై బిజెపి ప్రభుత్వ దమనకాండ

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య

కడప నగరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు ఆందోళన చేస్తుంటే బిజెపి ప్రభుత్వం కర్కశంగా పోలీసుల ద్వారా రైతులను కాల్చి చంపుతుందని, అన్నం పెట్టే రైతులను కాల్చి చంపడమే రామ రాజ్యమా అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. సోమవారం సిపిఐ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఎద్దుల బండ్లు, వ్యవసాయ ట్రాక్టర్లు, రైతులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా అని ప్రగల్భాలు పలికిన నరేంద్ర మోడీ ఇప్పటి వరకు కనీసం మద్దతు ధర కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో వ్యవసాయం ఆధారంగా లేక రైతులు అప్పుల బాధలతో లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకు, రైతులను రైతు కూలీల పాత్ర కొట్టేందుకు బిజెపి కుట్ర పడుతుందని హెచ్చరించారు. అందులో భాగంగా మూడు వ్యవసాయ చట్టాలను తీసు కువస్తే వాటిని రద్దు చేయాలని ఢిల్లీలో రైతులు నిరవధిక పోరాటం చేసి రద్దు చేయించుకున్నారన్నారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పటిష్టంగా అమలు చేయాలని, డబ్ల్యుటిఒ నుంచి వైదొలగాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే బిజెపి ప్రభుత్వం రైతులను కాల్చి చంపడం దారుణమని వాపోయారు. ఇటువంటి నిరంకుశత్వ కిరాత కమైన బిజెపి ప్రభుత్వాన్ని రైతులు ఓడించక తప్ప దన్నారు. భూమిని దున్ని, కొండలను బండలను పగలగొట్టి పంటలు పండించే రైతులు ఒక ఓటు ద్వారా బిజెపిని పడగొట్టడం పెద్ద విష యం కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, జెవిసి నాయకులు బాబు బాయ్, జాకీర్, సుబ్బరాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.రామయ్య, ఎల్. నాగ సుబ్బారెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

సుందరయ్య నగర్‌లో

సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - మైదుకూరు

మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో సుందరయ్య నగర్ వాసుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్యనగర్ వాసులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఏడేళ్లుగా దాదాపు 150 కుటుంబాల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పేదలు జీవనం సాగిస్తున్నారని కాలనీలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవటంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. పేదలు నివాసం ఉన్న చోట వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగిన అధికార పార్టీ ఎమ్మెల్యేకు సుందరయ్య నగర్‌లో ఇళ్లు కన్పించకపోవడం శోచనీయమన్నారు. మున్సిపాలిటీ నడిబొడ్డులో ఉన్న కాలనీలో వీధి దీపాలు, రోడ్లు లేవని, కాలనీ వాసులే మట్టిరోడ్లు ఏర్పాటు చేసుకున్నారని వారు తెలిపారు. ఇళ్లకు డోర్ నంబర్లు, విద్యుత్ మీటర్లు, ఏర్పాటుచేయాలని, టికెటి పట్టాలు మంజురు చేసి పక్కా భవనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురయ్య, బిబి, నాయకులు రవి, సుధాకర్, ఇమాం, గంగమ్మ, బాలరాజు, సుబ్బమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

'హైడ్రాప్స్ ఫీటాలిస్'కు అత్యాధునిక వైద్య చికిత్స

- పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ సద్దాం హుస్సేన్

ప్రజాశక్తి- కడప అర్బన్

పురిటి పిల్లలకు వచ్చే హైడ్రాప్స్ ఫీటాలిస్ వ్యాధికి కె.ఎస్. హెచ్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ పురిటి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.సద్దాం హుస్సేన్ తెలిపారు. సోమవారం నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న కె.ఎస్. హెచ్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరుకు చెందిన గోపు రాజేశ్వరి, విజయ్ సుకుమార్ దంపతులకు ప్రొద్దుటూరులోని ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించారని తెలిపారు. నవజాత శిశువుకు వైద్య పరీక్షల అనంతరం డాక్టర్లు హిమోగ్లోబిన్ 4 పాయింట్లు ఉందని, రక్తంలో ఇన్ఫెక్షన్ ఉందని హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాలని సూచించారన్నారు. అయితే వారు కె.ఎస్.హెచ్ చిన్నపిల్లల హాస్పిటల్ గురించి తెలుసుకుని ఆక్సిజన్ కలిగిన అంబులెన్స్‌తో తమ ఆసుపత్రికి వచ్చారని చెప్పారు. హైడ్రాప్స్ ఫీటాలిస్, హార్ట్ ఫెయిల్యూర్, ప్రమాదకరమైన కామెర్లు అనే వ్యాధితో శిశువు జన్మించారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాధితో పుట్టిన పిల్లలకు పుట్టిన వెంటనే వెంటిలేటర్ తో పాటు గుండె సంబంధిత మందులు, రక్త మార్పిడి చికిత్స అవసరం అవుతాయని చెప్పారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం వైద్య చికిత్సలు ప్రారంభించామన్నారు. 13 రోజులు చికిత్స అనంతరం శిశువు ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులు విజయ్, రాజేశ్వరి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కె.ఎస్.హెచ్ చిన్నపిల్లల హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బొజ్జా రోశన్న

ప్రజాశక్తి-కలసపాడు

టిడిపి జాతీయ నాయకులు చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బద్వేల్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జా రోశన్న పేర్కొన్నారు. సోమవారం కలసపాడు పంచాయతీలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తూ రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి మాజీ మంత్రి బిజీ వేముల వీరారెడ్డికి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలనలో ప్రజలు ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరని, అధికారం ఉన్నవారే ప్రజలను పీడించడం శోచనీయమన్నారు. పేదల భూములు తీసుకుంటూ, అన్ని విధాలుగా బాధలకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. రానున్న చంద్రబాబు పరిపాలనలో అందరూ శాంతియుతంగా ఎవరి పని వారు చేసుకుంటూ సంతోషంగా ఉండేందుకే సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పెట్టారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాధనకారి రంతు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పట్టాభి రెడ్డి, యువ నాయకులు దుగ్గిరెడ్డి మౌలాలి, తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ రామ్ సుబ్బయ్య, జిలాని బాష, హుస్సేన్ పీరా, మండల సలహాదారుడు నాగేశ్వరరావు, జెడ్ వి సుధాకర్, ఫొటో స్టూడియో రవి, ఎస్సి సెల్ సత్యం, భద్రయ్య, కార్యకర్తలు, అభిమానులు శ్రేయోభిలాషులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

టిడిపి మేనిఫెస్టోను అందిస్తున్న బొజ్జా రోశన్న

డివైడర్లు అడ్డం పెడితే సహించం

- హైవే అధికారులపై మండిపడ్డ స్థానికులు

ప్రజాశక్తి-చెన్నూరు

కడప -కర్నూల్ చెన్నూరు కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారి ఏర్పడక ముందే చెన్నూరు పాత రోడ్డు(గోసుల కళ్యాణమండపం, ఆంధ్ర స్పేస్) క్రాస్ రహదారి లోనుండే వాహనాలు రాకపోకలు ఉండేవని, ఇప్పుడు పాత రోడ్డు వద్దకు వాహనాలు రాకుండా అడ్డుకొని డివైడర్లు అడ్డం పెడితే ఎలా వెళ్లాలి అని స్థానిక ప్రజలు జాతీయ రహదారి అధికారుల తీరుపై మండిపడుతున్నారు రహదారి విషయమై సోమవారం పార్టీలకతీతంగా నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ పార్థసారధికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప -కర్నూల్ జాతీయ రహదారి గోసుల కళ్యాణమండపం క్రాస్ వద్ద నుంచి చెన్నూరు పాత రోడ్డు వద్దకు వెళ్లే రహదారికి అడ్డంగా నేషనల్ హైవే అధికారులు భారీ క్రైన్ ల ద్వారా డివైడర్లు పెట్టి రోడ్డును మూసి వేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. దీంతో మైనార్టీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆ పనులను అడ్డుకున్నామన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇదే రహదారిపై నుండి పాత రోడ్డు మీదికి వెళుతున్నామని, ఏవైనా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ దానిపైన కొంచమైనా శ్రద్ధ తీసుకోకుండా, ఇప్పుడు హడావిడిగా రోడ్డును మూసివేస్తామని రావడం విడ్డూరంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి కాకుండా చుట్టూ తిరిగి రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ రోడ్డు మార్గాన వాహనాలు వెళ్లేందుకు నేషనల్ హైవే అధికారులు, రెవిన్యూ అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, రోడ్డును మూసేసి ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా చూడాలని కోరారు. అనంతరం వారు నేషనల్ హైవే అధికారుల తీరుపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

పోలీసులకు మెరుగైన శిక్షణ : ఎఆర్ ఎఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రారంభమైన యాంటీ-రయట్ డ్రిల్ శిక్షణ ముమ్మరంగా కొనసాగుతోంది. సోమవారం సివిల్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది నూతనోత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు శిక్షణను పరిశీలించి హాజరైన పోలీస్ సిబ్బంది స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది స్పందిస్తూ తాము మరింత మెరుగైన విధులు నిర్వర్తించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఎంతో ఉపయోగకరంగా ఉందని, తమలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలమనే ధీమాను పెంపొందించిందని ఎస్.పికి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణలో భాగంగా గ్యాస్‌గన్‌తో గ్యాస్ షెల్ వినియోగంచే విధానం, వజ్ర వాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు.

రవాణా వ్యవస్థలో మేటి వైఎస్ఆర్ జిల్లా : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

కడప రైల్వేస్టేషన్‌తో పాటు జిల్లాలో రహదారి, విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయని, రవాణా వ్యవస్థలో వైఎస్ఆర్ జిల్లా మేటిగా నిలవనుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంబంధిత కేంద్ర మంత్రులతో కలిసి సోమవారం వర్చువల్ విధానం ద్వారా రూ. 20.35 కోట్ల కేంద్ర నిధులతో కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక రైల్వే శుభం హాలు నుంచి కలెక్టర్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనిక దృక్పథం నుండి ప్రేరణ పొంది, ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్లను ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేసి విశేషమైన మార్పును తీసుకువచ్చేలా కేంద్ర రైల్వే శాఖ భారీ పరివర్తనకు నాంది పలికిందన్నారు. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రయాణ ప్రాంగణంలో అధునాతన ట్రాఫిక్ నియంత్రణ సదుపాయాలు, వెయిటింగ్ రూములు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వంటి అనేక పబ్లిక్ సదుపాయాలను కల్పించనున్నారని చెప్పారు. అభివృద్ధి పనుల అనంతరం కడప రైల్వే స్టేషన్ ఒక అపురూపమైన నూతన జవసత్వాలు సంతరించుకుని, అత్యుత్తమ శ్రేణి స్టేషన్‌గా ప్రాముఖ్యత సంతరించుకోనుందన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ మధుసూదన్, సీనియర్ డివిజన్ ఇంజనీర్ (కోఆర్డినేషన్)యూ. అక్కిరెడ్డి, ఏడీ ఈఎన్ రాధాకృష్ణ, ఎడి ఎస్.టి.ఈ. కాత్యాయ కుమార్, చీఫ్ టిఐ ఉమర్ బాషా, డిఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, ఎస్.ఎం. శేఖర్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు శశిభూషన్ రెడ్డి, బిజెపి నేత సింగారెడ్డి రామచంద్రా రెడ్డి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవిజయదుర్గాదేవి కల్యాణం

ప్రజాశక్తి - కడప అర్బన్

కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

శ్రీ విజయదుర్గా మల్లికార్జునుల కల్యాణ ఉత్సవం సోమవారం శ్రీ విజయదుర్గా ఆలయంలో కన్ను లపండుగగా నిర్వహించారు. పురోహితుల వేద మంత్రాలు, పండితుల మనోహర వ్యాఖ్యానాలు, ముత్యాల తలంబ్రాలు, మంగళ వాయిద్యాలు, అశేష భక్తుల నీరాజనాలతో కనువిందు కమనీయ కల్యాణం నిర్వహించారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే కల్యాణ వైభవం పై భక్తి గానాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. తెల్లవారు జామున 25 కలశాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు ఆలయ వ్యవస్థాపకులు శ్రీ మల్లికార్జునరావు కుటుంబసభ్యులు సాయంత్రం శ్రీ విజయదుర్గా మల్లికార్జునుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి 8 గంటలకు శ్రీ విజయదుర్గాదేవి సింహవాహనంపై కడప ప్రజలకు కనువిందు చేశారు.

అభివృద్ధి పనుల లక్ష్యాన్ని ఛేదించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

విసి ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పనులను లక్ష్యం మేరకు గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోనిబోర్డ్ మీటింగ్ హాలులో కాస్ట్ సర్వే, జిజిఎంపి పనులు, ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ కార్డ్స్, హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, ఈబిసి నేస్తం, అంగన్వాడీ తనిఖీలు, ఆధార్ సర్వే, జగనన్న పాల వెల్లువ సర్వే, ఈకెవైసి, పిఎమ్ఇవై తదితర వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై జెసి జి. గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి మండల అధికారులతో విసి ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ ప్రాసెసెడ్ అర్జీలను పెండింగ్ లేకుండా ఏ రోజుకు ఆరోజు బిఎల్ఒలకు అలికేట్ చేసి వాటిని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రయారిటీ బిల్డింగ్స్ నిర్మాణం, 2వ దశ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల అక్నాలడ్జెట్‌మెంట్ డేటా పై సమీక్ష నిర్వహించారు. ఎపి సర్వీసెస్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో సంతృప్త స్థాయిలో నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు వెంటనే పరిష్కార మార్గాలను చూపాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బోర్డు మీటింగ్ హాలు నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కౌసర్ బాను, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డ్వామా, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు యాదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, కృష్ణయ్య, పరిశ్రమల శాఖ జిఎమ్ జయలక్ష్మి, సిపిఒ వెంకట్రావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసులు రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

సానియాకు పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం

ప్రజాశక్తి - కడప అర్బన్

సయ్యద్ సానియా

భారత పార్లమెంట్ భవనంలో ప్రసంగించే అరుదైన సువర్ణ అవ కాశం కడప వాసి సయ్యద్ సానియాకు దక్కిందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవ హారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంగతాన్ ఆంధ్రప్రదేశ్ వారు వర్చువల్ మోడ్‌లో నిర్వహించిన జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2024 అనే కార్యక్రమంలో జిల్లా స్థాయి నుంచి గెలుపొంది రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర నుంచి గెలుపొంది దేశ స్థాయికి వెళ్లారని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి వెళ్లి పార్లమెంట్ భవనంలో ప్రసంగిస్తారని తెలిపారు. సానియా చదువుకుంటూ మంచి వక్త గా రాణించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. తద్వారా కుటుంబ సభ్యులకు, మన జిల్లా కు , రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు సంపాది ంచిదని తెలిపారు. ఇలాంటి వారిని జిల్లా యువత స్ఫూర్తి గా తీసుకుని మరెన్నో శిఖరాలు అధిష్టించాలని ఆశించారు.

పెండింగ్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలి

కలసపాడు : మండలంలో పెండింగ్‌లో ఉన్న 1400 ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేయాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆశావర్కర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. వాటిని ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలన్నారు. కార్డుల పంపిణీలో మండలం చాలా వెనుకబడిందన్నారు. గ్రామాలలో వాలంటీర్లతో కలిసి ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్యశ్రీ కార్డులను అందరికీ అందజేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ దుర్గ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

వల్లూరు : ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందించి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారిధిగా పనిచేసిన వాలంటీర్ల సేవలు అభినందనీయమని కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్ల సత్కార సభలో పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలు 5 మందికి సేవా రత్న, 134 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీ సభ్యుల పేరిట లంచాలు తీసుకుని సంక్షేమ పథకాలు అందించడం చూశామన్నారు. నేడు అర్హత ఉంటే చాలు పార్టీలు, కులాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర యూత్ లీడర్ ఇంది రెడ్డి శంకర్ రెడ్డి, ఎంపిడిఒ విజయ భాస్కర్ , సొసైటీ బ్యాంక్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ శివకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, అధికారులు, మండల వైసిపి నాయకులు, గుర్రంపాటి వెంకటసుబ్బారెడ్డి, మండల ఎంపిటిసిలు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

కలసపాడు : మండలంలోని రామాపురంలో వైసిపి కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసిపి ఏర్పాటు నుంచి బడుగు బలహీన వర్గాలను ఆదుకోవడంలో ముందుందని చెప్పారు. సంక్షేమ పథకాలే పేదలకు అండగా నిలిచాయన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ఒక పార్టీ కార్యాలయం అవసరమని భావించి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి పార్టీ అధ్యక్షులు తగిలి సుదర్శన్, జడ్‌పిటిసి అంకన్న గురు రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా , రాజశేఖర్ రెడ్డి, ఎంపిపి బోధన బోయిన నిర్మల నారాయణ, మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ఎంపిటిసి కొండ దామోదర్ రెడ్డి, దిగు పల్లె , సింగరయ్య రామాపురం అంకిరెడ్డి, లక్ష్మి రెడ్డి , పేటు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్రగా భాస్కర్‌రావు

ప్రజాశక్తి - కడప

ఛాంపియన్లతో నిర్వాహకులు

కడప నగరంలోని యూఎస్ మహల్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో విశాఖపట్నానికి చెందిన భాస్కర్‌రావు ఛాంపియన్స్‌గా నిలిచి మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను కైవసం చేసు కున్నారు. రన్నర్స్‌గా విజయ నగరానికి చెందిన కిషోర్ నిలిచాడు. బెస్ట్ ఫోజర్‌గా కడపకు చెందిన మెహరాజ్ నిలవడం విశేషం. ఈ పోటీలలో రాష్ట్రానికి చెందిన వివిధ జిల్లాలకు సంబంధించి 300 మంది పాల్గొన్న ఈ పోటీలలో 15 కేటగిరీలకు చెందిన విభాగాలలో పోటీలు నిర్వహించారు. మిస్టర్ ఆంధ్ర, రన్నర్ ఆఫ్, బెస్ట్ పోసర్‌గా నిలిచిన వారికి అధిక మొత్తంలో నగదుఅవార్డులను అందజేశారు. బాడీ బిల్డింగ్ పోటీల నేపథ్యంలో సినీ నటులు రామ్ జగన్, గీతా సింగ్, జబర్దస్త్ శాంతి కుమార్, జంగిల్ జగన్, హరికృష్ణ, కార్తీక్ ప్రసాద్ కామెడీ షోలు, డాన్స్ షో లతో అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య, నాయ కులు అమర్నాథ్, జన వికాస్ తాహీర్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్ష కార్యదర్శులు నూనె నగేష్, షేక్ యునుస్ భాష, చైర్మన్ యు. వై. కుమార్, కోశాధికారికి రమేష్, మహిళా అధ్యక్షురాలు సీమా, అసోసియేట్ అధ్యక్షులు శివప్రసాద్, ఐ బి ఎఫ్ రెఫరీలు సత్య, సోని, బాడీ బిల్డర్లు పాల్గొన్నారు.

అలవెన్సులు చెల్లించాలి

కడప అర్బన్ : ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయీస్ యూనియన్ ఆర్‌టిసి గ్యారేజ్ సిబ్బందికి విలీనానికి ముందున్న ఇన్సెంటివ్ స్కీమ్, అలవెన్సులు చెల్లించాలని ఇయు రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు డిమాండ్ చేశారు. సోమవారం కడపజోన్‌లో ఉన్న 52 డిపోల గ్యారేజ్ సిబ్బందితో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులు మెయింటెనెన్సు మెరుగుపర్చేందుకు అవసరమైన స్పేర్ పార్ట్స్, టూల్స్ పంపిణీ చేస్తామన్నారు. ఆర్టీసి ఉద్యోగులుకు విలీనంకు ముందున్న గ్యారేజ్ సిబ్బందికి ఇచ్చే నైట్ షిఫ్ట్ అలవెన్సుతో పాటు అన్ని అలవెన్సులు చెల్లించాలని పేర్కొన్నారు. కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్యారేజ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్య క్షులు వై.నాగరాజు, రాష్ట్ర నాయకులు మజీద్, మురగమ్మ, రాధాకృష్ణ, జోనల్ కమిటీ సభ్యులు, 8 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు 52 డిపోల గ్యారేజీ కమిటీ నాయకులు, నాన్ ఆపరేషన్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎగుమతి కూలి రేట్లు పెంచాలి

కడప అర్బన్ : బేవరేజ్ హమాలీలకు ఎగుమతి కూలి రేట్లు పెంచాలని హమాలీ యూనియన్ అధ్యక్షులు రఘురామయ్య కోరారు. సోమవారం ఐఎంఎల్ గోడౌన్ ఎదుట హమాలీ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగుమతి కూలి రేట్ల ఒప్పందం 2024, అక్టోబర్ 31తో ముగిసిందని పేర్కొన్నారు. ఎపి ఎస్‌బిసిఎల్ యాజమాన్యం కొత్త మద్యం రవాణా ఒప్పందదారులతో కూలి రేట్లు నిర్ణయించకుండా ఆలస్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా ఎగుమతి కూలి రేట్లు పెంచి హమాలీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్.వి. సుబ్బారెడ్డి, నాయకులు రెడ్డిప్రసాదు, ఎన్. సుబ్బారెడ్డి, పి.వెంకటరమణ, ఆర్. సుబ్బరాయుడు, కృష్ణయ్య, కొండారెడ్డి, మదన్, కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

కడప : మార్చి 9న జిల్లా వ్యాప్తంగా నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మహాశివరాత్రి, నిరంతర ప్రభుత్వ సెలవుల కారణంగా అదే నెల 16కు వాయిదా వేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు, కక్షిదారులు గమనించాలని వారు కోరారు.

సన్మానం అందుకున్న పుట్టా సుధాకర్ యాదవ్

విగ్రహ ప్రతిష్టాపనలో 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అన్నవరం సుధాకర్ రెడ్డి, నాగులపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాయబ్ రసూల్, షరీఫ్, లాల్ బాషా, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, వైవి సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రామాంజనేయులు, నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పుట్టా సుధాకర్ యాదవ్‌కు అభినందనలు

ఖాజీపేట : మైదుకూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిన సందర్భంగా సోమవారం మండలం టిడిపి శ్రేణులు ప్రొద్దుటూరులోని పుట్టా నివాసానికి వెళ్లి అభినందనలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కేక్ చేసి సంబరాలు చేసుకున్నారు. కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ మొహిద్దీన్, ఇట్టేం శ్రీరాములు యాదవ్, తుట్టే రాము యాదవ్, ఖాజీపేటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు ఉన్నారు. రానున్న సర్వత్రిక ఎన్నికల్లో పుట్టా సుధాకర్ యాదవ్ అత్యధిక మెజారిటీతో గెలుపునకు తాము కృషి చేస్తామని పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణాలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, పివి రమణ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని జీవాల మార్కెట్ సమీపంలో అస్తవ్యస్తంగా నిర్మిస్తున్న డ్రయినేజీ కాలువలను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లెలో రోడ్ల విస్తరణలో భాగంగా పులివెందుల-కడప-గండి రోడ్డులో ఒక ప్రణాళికబద్ధంగా కాకుండా గోతులు తీశారన్నారు. నెలల తరబడి ఇష్టానుసారంగా డ్రయినేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కాలువ పనులు సరిగా జరగకపోవడం వల్ల నష్ట పోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కాంట్రాక్టర్‌కు బిల్లు పడకపోతే ఎంత బాధ పడుతారో వ్యాపారులది కూడా అదే పరిస్థితి అన్నారు. మూడు రోజుల్లో కల్వర్టు పనులు పూర్తి చేయకపోతే మట్టి వేసి పూడ్చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొటూరు నాగభూషణం, భాస్కర్, ఎంవి రమణ పాల్గొన్నారు.

టిడిపిలో మాజీ జడ్‌పిటిసి చేరిక

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాజుపాలెం మాజీ జడ్‌పిటిసి సభ్యుడు వెల్లాల గ్రామానికి చెందిన రామనాథం భాస్కర్ ఆయన సతీమణి ప్రస్తుత ఎంపిటిసి ప్రభావతమ్మ ప్రొద్దుటూరు పాత బస్టాండ్‌లోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో సీఎం సురేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ నాయుడు మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు టిడిపి పట్ల ఆకర్షితులై, చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నారన్నారు. చాలామంది ఎమ్మెల్యే అక్రమాలను చూచి కలత చెంది టిడిపిలో చేరుతున్నారు. 2024 ఎన్నికల్లో పొద్దుటూరు టిడిపి టికెట్‌పై పోటీ చేస్తానన్నారు. ఆ నమ్మకం నాకు ఉందన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. రామనాథం భాస్కర్ మాట్లాడుతూ వైసిపిలో సరైన గౌరవం లేకపోవడంతో పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇవి సుధాకర్‌రెడ్డి, ముక్తియార్, కౌన్సిలర్ మునీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం.. అభివృద్ధి కోసం టిడిపిని ఆదరిద్దామని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తారని తెలిపారు. రాజీవ్ గాంధీ ఎకో పార్కులో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రభుత్వం వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృత్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రొద్దుటూరు : అమృత్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమం చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నిరసన శిబిరానికి చేరుకొని ఆయన మాట్లాడారు. 15 సంవత్సరముల క్రితం అమృత్‌నగర్‌లో 2300 మంది పేదలకు ఇళ్లపట్టాలిచ్చి స్థలాలు చూపించారు.. కానీ మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఊర్లు నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ పేదలకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, హసీనా, పుష్పలత, మల్లిక, భాను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కొండసుంకేసులలో ఘర్షణ

- రాళ్లు, ఇనుప కడ్డీలతో దాడి -15 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి పెద్దముడియం/ జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైసిపి, టిడిపి నేతలు, కార్యకర్తలు మాటల యుద్ధంతోనేకాక చేతలు చేసుకొనే స్థాయికి చేరుకుంది. మొన్న ముద్దనూరు మండల కేంద్రంలో జరిగిన గొడవ మరువక ముందే, ఆదివారం పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామంలో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి కొండసుంకేసుల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొన్ని కుటుంబాలను టిడిపిలో చేర్చుకున్నారు. టిడిపి జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కూడా హాజరయ్యారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన కొన్ని నిధులు దారి మళ్లాయని విమర్శలు చేశారు. ఇవి సోషల్ మీడియాలో రావడంతో సోమవారం ఇరువురు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ చివరకు గ్రామంలోని చావిడి వద్ద ఒకరిపై ఒకరు రాళ్లు, ఇనుప పైపులతో దాడికి దిగారు. దాడిలో టిడిపి కార్యకర్తలు వెంకట్రామిరెడ్డి మరో వ్యక్తికి, వైసిపి కార్యకర్తల్లో పుల్లారెడ్డి, చిన్న హుస్సేన్‌కు రక్త గాయాలయ్యాయి. ఇరు పార్టీలకు చెందిన మరి కొంతమందికి చిన్నచిన్న గాయాలు, మూగదెబ్బలు తగిలాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఎస్ఐ రామకృష్ణ ఇరుపార్టీలకు చెందిన 15 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయాలైన కార్యకర్తలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

గోవా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గోవా నుండి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎర్రగుంట్ల ఎస్ఇబి అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి సీఐ లీలారాణి మాట్లాడుతూ గోవా మద్యాన్ని ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వద్ద విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మోహన్‌రెడ్డి, చిన్న తిరుపాల్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 20 ఫుల్ బాటిళ్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇరువురుపై కేసు నమోదు చేసినట్లు సీఐ లీలారాణి తెలిపారు.

సిపిడబ్ల్యు స్కీం నీటి సరఫరా నిలిపివేత

మరమ్మతుల కారణంగా ఫిబ్రవరి 5 నుంచి నీటి బంద్ - లోకల్ బోర్ల ద్వారా సరఫరా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన తాగునీటి వనరైన పార్నపల్లె బృహుత్తర నీటి పథకం(కాంపెన్సివ్ ప్రొటెక్ట్ వాటర్ స్కీమ్) నుంచి నీటి సరఫరా నిలిపేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 1996లో నియోజకవర్గంలోని సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, తొండూరు మండలాల్లోనే 110 గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ స్కీమ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా చివరి గ్రామాలకు నీటి సరఫరా కావడం లేదు. ప్రస్తుతం 35 హెబిటేషన్లకు మాత్రమే నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఈనెల 5వ తేదీ నుంచి నీటి సరఫరా నిలిపేసి మరమ్మతులు చేపట్టారు. పార్నపల్లి డ్యాం వద్దనున్న పంప్‌హౌస్ వద్ద గతంలో ఉన్న 200 హెచ్‌పి స్థానంలో ప్రస్తుతం 300 హెచ్‌పి సామర్థ్యం కలిగిన మోటరు ఏర్పాటు చేస్తున్నారు.

పంప్‌హౌస్ వద్ద జరుగుతున్న మరమ్మతులు

లోకల్ బోర్లతో నీటి సరఫరా..

సిపిడబ్ల్యు స్కీమ్ పరిధిలో గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు లోకల్ బోర్లు, వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ కారణంగా కొన్ని గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో లోకల్ బోర్లలో సైతం భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. అదేవిధంగా స్థానిక బోర్లలో ఫ్లోరైడ్ నీరు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి..

సిపిడబ్ల్యు స్కీమ్ నుంచి వస్తున్న నీటి సరఫరా త్వరగా పునరుద్ధరించాలి. అధికారులు మరమ్మతు పనులు వేగవంతం చేయాలి. వేసవి కారణంగా నీటి సమస్య ఎక్కువగా ఉంది.

- గోపాల్ రెడ్డి, సింహాద్రిపురం

వారం రోజుల్లో పునరుద్ధరిస్తాం

మరమ్మతుల కారణంగా సిపిడబ్ల్యు స్కీమ్ నుంచి నీటి సరఫరా నిలిపేశాం. మరమ్మతు పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.

- విజయభాస్కర్, ఇఇ, ఆర్‌డబ్ల్యుఎస్, పులివెందుల

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. సోమవారం నిర్వహించిన అల్లాడుపల్లె దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పురాతన దేవాలయమైన అల్లాడుపల్లె స్వామిని దర్శించుకునేందుకు జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. అందుకు అనుగుణంగా ఆలయ ఆవరణలో ఏర్పాట్లు కల్పించేలా నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా అల్లాడుపల్లె గ్రామానికి చెందిన జివై వెంకట సుబ్బారెడ్డి (ఉదయ్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు చైర్మన్, కమిటీ మెంబర్లచే ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి టిలక్షుమయ్య, అల్లాడుపల్లె సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శాంతరాజు, పివి రమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, రామాం జనేయులురెడ్డి, మహేష్ యాదవ్, రమణయ్య, ప్రసాద్, నాయకులు, ఆలయ ఇఒ శ్రీనివాసులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ కమిటి జివై వెంకట సుబ్బారెడ్డి (చైర్మన్), మెంబర్లుగా ఉమామహేశ్వరి, సావిత్రమ్మ, ఖాదరమ్మ, దస్తగిరమ్మ, బుజ్జీ, పుల్లారెడ్డి, శేషయ్య, శివశంకర్ ప్రమాణ స్వీకారం చేశారు.

చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు

1 నుంచి అల్లాడుపల్లెలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో మార్చి 1నుంచి 10వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జిఒ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ జిఎం కిషోర్‌కుమార్‌రెడ్డి, ఇఒ శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి లక్షుమయ్య, వైసిపి నాయకులు, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సహజ సంపదను దోచుకుంటున్న అక్రమార్కులు

చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొంతమంది అక్రమార్కులు సహజ వనరులు, సంపదను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు ఉన్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు అన్నారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గూడెంచెరువు, ఒంటిమిద్దె పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ గండికోటకు వెళ్లే దారిలో ఒంటిమిద్దె గ్రామానికి సమీపాన ఉన్న చెరువులో కొంతమంది అక్రమంగా మట్టిని, ఎర్రమట్టిని, గ్రావెలు, చౌడు మట్టిని తరలిస్తున్నారన్నారు.

అక్రమార్కులు రాత్రిపగలు అనేతేడా లేకుండా ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా యథేచ్ఛగా ట్రాక్టర్లు, టిప్పర్లతో ఖనిజ సంపదను తరలిస్తూ అక్రమ సంపా దనకు పాల్పడుతున్నారన్నారు. ఇదివరకే ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు మేలు కోవాలని కోరారు. అక్రమాలకు పాల్పడుతున్నారో వారిపై సంబంధిత మైనిం గ్ అధికారులు, ఆర్డిఒ, తహశీల్దార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి విజయ్, శ్రీమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం పులివెందుల, వేముల మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. సోమవారం ఉదయం నాలుగు గంటలకే తన నివాసంలో ఎంపీ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల వినతులను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించారు. పట్టణంలోని నగరిగుట్టలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వేముల మండలంలోని వేల్పుల గ్రామపంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. స్థానిక మబ్బు చింతలపల్లె క్రాస్‌లో సుమారు రూ.14 లక్షలతో నిర్మించిన భ్రమరాంబిక దేవాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. బెస్తవారిపల్లి గ్రామానికి చేరుకొని జగనన్న కాలనీలో ఇంటింటా తిరిగి వారి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేల్పుల సమీపంలోని మదర్స పాఠశాలలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వేల్పులకు చేరుకుని మాజీ ఎంపిపి ఉషారాణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు రామలింగారెడ్డి తన తండ్రి పేరుమీద నిర్మించిన బస్ సెంటర్‌ను ప్రారంభించారు. పక్కనే ఉన్న చర్చిలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రూ.కోటి 70 లక్షలతో నిర్మించిన వేల్పుల ప్రాథమిక పాఠశాలను ఎంపీ ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయం, రూ.70 లక్షలతో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయాన్ని, రూ.10 లక్షల నిర్మించిన అంకాలమ్మ దేవాలయాన్ని ఆయన ప్రారంభించారు. బండ లాగు పోటీలను ఎంపీ ప్రారంభించి, తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ సల్ల గంగాదేవి, జెడ్పిటిసి సభ్యుడు బయపరెడ్డి, వేల్పుల ఎంపీటీసి సభ్యుడు, సర్పంచ్, మాజీ సర్పంచ్ పార్వతమ్మ, తొండూరు మండల వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల మండల వైసిపి కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, పురపాలక చెర్మన్ వరప్రసాద్, దేవాదాయశాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఒ, వేముల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేల్పుల లో స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, పోటాపోటీగా బండి లాగుడు పోటీలు

నిండు జీవితానికి రెండు చుక్కలు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : నిండు జీవితానికి రెండు చుక్కలు చాలని, మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కామనూరు పిహెచ్‌సి వైద్యాధికారి హనీఫ్‌బాబా కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల వయసు గల వారందరికీ తప్పక పోలియో చుక్కలు వేయాలని పేర్కొన్నారు. సోమవారం ప్రొద్దుటూరు మండల సభాభవనంలో జరిగిన పల్స్‌పోలియో శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్ వైజర్ బిఎ వర ప్రసాద్ మాట్లాడుతూ కామనూరు పిహెచ్‌సీలో నాలుగు రూట్‌లలో నలభై ఆరు కేంద్రాలలో ఒక మొబైల్ టీం ద్వారా 5,451 మందికి చుక్కలు మొదటి రోజు వేస్తారని తెలిపారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, చంద్రకళ, అంగన్వాడీ సూపర్‌వైజర్ కళావతి,హెల్త్ అసిస్టెంట్స్ సుబ్బయ్య, లక్ష్మి నారాయణ, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

సురేష్‌నాయుడుకు సేవారత్న బిరుదు ప్రదానం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు పట్టణంలో పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మన ప్రజా సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నా క్యాంటీన్ 200 రోజులు విజయవంతంగా నిర్వహించిన అన్నదాత, అన్న క్యాంటీన్ అధినేత సిఎం సురేష్ నాయుడుకు సమితి అధ్యక్షులు అయుబ్ ఖాన్ ప్రొద్దుటూరు సేవారత్న బిరుదు ప్రదానం చేశారు. అన్న క్యాంటీన్ చెర్మన్ విఎస్ ముక్తియార్‌కు సిరి పురి సేవ రత్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అయుబ్ ఖాన్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి మూడు మొబైల్ ద్వారా భోజన సదుపాయం ఏర్పాటు చేసి, అన్న క్యాంటీన్‌లో ప్రతి రోజు 5000 మందికి భోజనం సదుపాయం కలిగించడం అభినందనీయమన్నారు. సీఎం సురేష్ నాయుడు తండ్రి ముని స్వామి నాయుడు, న్యాయవాది ఇవి సుధాకర్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, 19వవార్డు కౌన్సిలర్ మునీర్, మన ప్రజా సేవా సమితి గౌరవ అధ్యక్షులు అరబ్‌సా, ఉపాధ్యక్షులు బిటెక్ బాషా, సహా య కార్యదర్శి మహేష్, మన ప్రజా సేవ సమితి యువత జహీర్, యూ సుఫ్, మధుసూదన్, పీటర్, సంతోష్, అబ్దుల్ ఖాదర్, సభ్యులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ అధినేతను సన్మానిస్తున్న సమితి సభ్యులు

శ్రీ కోదండరామస్వామి దేవాలయం

ముద్దనూరు (గ్రా&మం), కడప జిల్లా.

e-Procurement Tender

NIT NO. P/COE/163/2024-15 Dt: 25/01/2024

దేవాలయ పున: నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : ధర్మకర్త

పేరు మార్పు

కడప జిల్లా అట్లూరు మండలం గుజ్జులవారిపల్లి గ్రామం డోర్ నెంబర్ 3-42 కాపురస్తులు పట్టం నారాయణ రెడ్డి గారి కుమారుడనైన పట్టం నారాయణ రెడ్డి అను నేను ఈ దినం నుండి పట్టెం నారాయణ రెడ్డి తండ్రి పట్టెం నారాయణ రెడ్డి గా పేరు మార్చుకున్నాను.

పరిశ్రమ ఏర్పాటుతో యువతకు ఉపాధి

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామీణ ప్రాంతాలలో సైతం పరిశ్రమ ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు రావడం హర్షణీయమని, తద్వారా ఉద్యోగ అవకాశాలు యువతకు లభిస్తాయని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో నూతనంగా ఎస్‌కెఆర్‌యూ పి.వి.సి పరిశ్రమ యజమాని ఇరగంరెడ్డి లక్ష్మిరెడ్డి ఏర్పాటు చేసిన పరిశ్రమను సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, వైసిపి నాయకులు ఇరగంరెడ్డి వీరారెడ్డి, ఆంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, తిప్పయపల్లె సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మండలం కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్

నేడు 'ఉపాధి' పనులపై ఓపెన్ ఫోరం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో గతేడాది జరిగిన ఉపాధి హామీ చట్టం పనులపై మంగళవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సల్మాన్‌రాజ్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం భారతి తెలిపారు. సింహాద్రిపురంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 25తేదీ వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృంద సభ్యులు గుర్తించిన అంశాలపై ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

రేపు సతీష్‌రెడ్డి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో ఈనెల 28న మధ్యాహ్నం శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. సతీష్‌రెడ్డి కొన్నేళ్లుగా టిడిపికి రాజీనామా చేసి మౌనంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు రానున్న సందర్భంగా వైసిపి, టిడిపి నాయకులు సతీష్ రెడ్డిని కలిసి తమ పార్టీలోకి రావాలని కోరారు. ఈ పరిస్థితుల్లో సతీష్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో చర్చించేందుకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జెఎన్‌టియు కళాశాల బిటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో నిర్వహించిన బిటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్(ఆర్-23)రెగ్యులర్, రెండవ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్(ఆర్-20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ యం.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బిటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 304 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 158 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బిటెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 337 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 195 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బిటెక్ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 343 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 255 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను కొద్ది సమయంలోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.హుస్సేన్‌వలి, డాక్టర్ ఎం.సాంబయ్యను ప్రిన్సిపల్ అభినందించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అనంతపురం తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగే ఎన్నికల శంఖారావం మహాసభకు వేంపల్లె నుండి భారీ ఎత్తున పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేకహోదా సాధ్యమన్నారు. విభజన హామీలు అమలు కాంగ్రెస్‌తోనే వీలవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురం వెళ్లిన వారిలో పులివెందుల సమన్వయ కమిటీ సభ్యుడు మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చెన్నకేశవ, రాజా, ఉత్తన్న, బద్రి, రవి, పీర్ బాషా, రాజా, వినయ్, రాజు, శివ, సుబ్బరాయుడు, ఆరుశేర్ల సుబ్బరాయుడు, మాస్, అమర్ పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు

వేంపల్లె : భూగర్భ జలాలు పెంపొందించేందుకు సహకరించిన కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డికి జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల బ్రాంచి కాలువ నుండి గిడ్డంగువారిపల్లె చెరువుకు నాలుగు మోటర్లు ఆన్‌చేసి నీటిని వదలినట్లు చెప్పారు. ఎంపీ అవినాష్‌రెడ్డి దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేయడంతోపాటు పిబిసి కెనాల్‌లో పెరిగిన జమ్మును తొలగించారన్నారు. కెనాల్‌లో జమ్మును తొలగించడంతో కాలువలకు సాగునీరు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. గిడ్డింగివారిపల్లె, బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లె, ముసల్‌రెడ్డిగారి పల్లె గ్రామాలకు పుష్కలంగా సాగునీరు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల తరుపున అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

ప్రొద్దుటూరు : పాఠశాలకని బయలుదేరిన ఇరువురు బాలికలు అటు పాఠశాలకు వెళ్లక, ఇటు ఇంటికీ రాకపోవడంతో ఫోన్‌కాల్‌తో అప్రమత్తమైన 3టౌన్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఇరువురు మైనర్ బాలికలు పాఠశాలకని వచ్చి పాఠశాల గేటు వరకు చేరుకొని అక్కడి నుండి అదృశ్యమయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంటనే అప్రమత్తమై 3టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికల తల్లిదండ్రులను పిలిపించి విచారిస్తుండగా ఇరువురు బాలికల్లో ఒకరు గుర్తు తెలియని ఫోన్ నుండి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన కోసం వెతకవద్దు పోలీసులకు ఫిర్యాదు చేయవద్దు.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చచ్చిపోతాను అని బెదిరించింది. పోలీసులు ఉన్నతాధికారులకు తెలిపి సాంకేతిక సమాచారంతో బాలిక ఫోన్ చేసిన నెంబర్ వివరాలు సేకరించి చాకచక్యంగా బాలికలను అదుపుతోనికి తీసుకున్నారు. పాఠశాలకు పిల్లలు రాకపోవడంతో వెంటనే అప్రమత్తమై ఉపాధ్యాయుడు, పోలీసులు, పిల్లల తల్లిదండ్రులు సత్వర చర్యలు తీసుకోవడంతో పిల్లలు క్షేమంగా తమ ఇళ్లకు చేరుకున్నారు. రెండు గంటలలో కథ సుఖాంతమైంది. బాలికలను ట్రేస్ చేయడంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ గురివిరెడ్డి చూపిన చొరవకు శెభాష్ అనిపించుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పురపాలక శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Tender Notice No.299 to 316/2023-24/E1, తేది: 26.02.2024

పులివెందుల పురపాలక సంఘము నందు అభివృద్ధి పనులకు సంబంధించి దిగువ తెలిపిన మేరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది.

వ. నెం	టెండరు నోటీసు నెం	పనుల సంఖ్య	అంచనాల మొత్తము
1	299 to 311/2023-24 PADA Grants	13	రూ.205.40 లక్షలు
2	312 to 314/2023-24 General Funds	3	రూ.21.04 లక్షలు
3	315/2023-24 GGMP Grants	1	రూ.2.60 లక్షలు
4	316/2023-24 SFC Grants	1	రూ.12.00 లక్షలు

బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడింగ్ ప్రారంభపు తేది : 27-02-2024 సా. 6.00 గం.
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడింగ్ ముగింపు తేది : 13-03-2024 మ. 3.30 గం.
బిడ్స్ స్వీకరణ చివర తేది : 13-03-2024 మ. 3.30 గంటలకు
బిడ్స్ తెరచు తేది : 13-03-2024 సా. 4.30 గంటలకు

తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.ap.eprocurement. gov.in లో చూడవచ్చును. ఫోన్: 9866556185.

కమీషనరు
పులివెందుల పురపాలక సంఘము.